

మెంగారంలో డెంగీతో ఒకరి మృతి

లింగంపేట, ఆగస్టు 29: మండలంలోని మెంగారంలో గురువారం డెంగీతో అన్నం రాజు(42) మృతి చెందాడు. రాజుకు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో రెండు రోజుల క్రితం లింగంపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా వారు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సక్కుబాయి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మండలంలో డెంగీతో ఇప్పటి వరకు ఇద్దరు మృతి చెందడంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.








ఫొటోలు సేకరిస్తున్న సిబ్బంది

పంట రుణమాఫీ..
రైతులందరికీ వర్తించేనా?

కామారెడ్డి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియ చేపడుతోంది. ఇప్పటికే మూడు విడతల్లో అర్హులైన రైతులకు రుణమాఫీ పూర్తి చేసింది. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులందరి కీ మాఫీ చేసేందు కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రైతులకు కుటుంబ నిర్ధారణ కార్యక్రమం జిల్లా వ్యవసాయశాఖ ప్రారంభించింది. రుణమాఫీ కానివారు దరఖాస్తు చేసుకున్న వివరాల ఆధారంగా సర్వే చేపడుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏవోలు గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల నుంచి కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలవుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



రుణమాఫీ కాని రైతులపై ప్రభుత్వం దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.2లక్షల లోపు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. జిల్లాలో మూడు విడతలుగా రుణమాఫీని చేసింది. అయితే అన్ని అర్హతలు ఉన్నా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. కొందరికి రేషన్‌కార్డులు లేకపోవడం, ఆధార్‌కార్డుల్లో తప్పులు దొర్లడం, పట్టా పాస్‌బుక్‌లో పేర్లు, ఆధార్‌కార్డుల్లో పేరుతో సరిపోకపోవడం తదితర సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళన చెంది వ్యవసాయశాఖ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం రుణమాఫీ కాని రైతులపై దృష్టి పెట్టింది.

వివరాలు నిర్ధారణ కాక 17వేల మంది రుణమాఫీకి దూరం

రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో పంట రుణాల మాఫీ చేసిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాలతో చాలా మంది అర్హులైన రైతులు రుణమాఫీకి ఎంపిక కాలేదు. ఈ నేపథ్యంలో ఆయా రైతుల నుంచి వ్యవసాయ శాఖ దరఖాస్తులు స్వీకరించింది. పలు కారణాలతో కుటుంబ నిర్ధారణ కాక సుమారు 17 వేల మంది రైతులు రుణమాఫీకి దూరం అయినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా రుణమాఫీ చేయాలంటూ ఆ పథకానికి తామంతా అర్హులమని మరో 8,900ల మంది రైతులు దరఖాస్తులు చేశారు. వీటి ఆధారంగా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. యాప్ వాడకంపై మండల వ్యవసాయ అధికారులకు ప్రత్యేక అవగాహన కల్పించింది. మొదట కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు మండల నోడల్ అధికారులుగా వ్యవహరిస్తున్న ఏవోలు జిల్లాలోని అన్ని మండలాల్లో కుటుంబ నిర్ధారణ సర్వేను ప్రారంభించారు.

- రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణ సర్వే
- గ్రామగ్రామాన వ్యవసాయశాఖ వివరాల సేకరణ
- కుటుంబ సభ్యుల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో ప్రారంభమైన సర్వే
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు
- జిల్లాలో వివరాలు నిర్ధారణ కానివారు సుమారు 17వేల మంది
- రుణమాఫీకి 8,900ల దరఖాస్తులు
- సర్వే పూర్తయ్యాక అర్హులైన వారికి రుణమాఫీ అందే అవకాశం
- ఇప్పటికే మూడు విడతల్లో 91,899 మందికి రుణమాఫీ

నెల రోజుల పాటు సాగనున్న సర్వే

కుటుంబ సభ్యుల వివరాలు నిర్ధారణ కాక రుణమాఫీ పొందని రైతుల వద్దకే మండల వ్యవసాయ అధికారులు వెళ్లి వారి కుటుంబ సభ్యుల ఆధార్ నెంబర్లను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత కుటుంబ పెద్ద నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటారు. ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్నట్లు ఫొటోలు తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నారు. ఈ ప్రక్రియ నెలరోజుల పాటు కొనసాగనుంది. కుటుంబ నిర్ధారణ పూర్తయ్యాక ఆయా రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.


మూడు విడతల్లో 91,899 మంది రైతులకు రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రైతుల పంట రుణాల మాఫీ చేపట్టింది. జిల్లాలో 91,899 మంది రైతులకు రుణమాఫీ చేయగా రూ.655.37 కోట్ల నిధులను విడుదల చేసింది. మొదటి విడతలో 49,540 మంది రైతులకు మాఫీ చేయగా రూ.231.13కోట్లు విడుదల చేసింది. రెండో విడ తలో 24,816 మంది రైతులకు మాఫీ చేయగా రూ.211.72 కోట్ల నిధులను, మూడో విడతలో 17,543 మంది రైతులకు మాఫీ చేయగా రూ.212.52కోట్ల నిధులను విడుదల చేసింది.

సర్వే చేపడుతున్నాం

● తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ కోసం కుటుంబ నిర్ధారణ సర్వే చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో ఏవోలు రైతుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నాం. వ్యవసాయశాఖ అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు నెంబర్లను అందజేయాలి. అదేవిధంగా కుటుంబ సభ్యులవివరాలతో ధ్రువీకరణ పత్రాన్ని అందించాలి. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట
తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29: అవినీతి అక్రమాలకు పాల్పడిన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ లక్ష్మణ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. దళారుల ద్వారా డబ్బులు తీసుకుని పని చేస్తున్నట్లు తహసీల్దార్ పైన అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణ జరిపి గురువారం తహసీల్దార్‌ను సస్పెన్షన్ చేశారు. డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారని, డబ్బులివ్వని వారి పనులు చేయడం లేదని ఇటీవల మండలంలోని పలు గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ బాధిత రైతులతో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో తహసీల్దార్ లక్ష్మణ్‌ను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



సస్పెన్షన్‌కు గురైన లక్ష్మణ్

మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 29: మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు, వ్యాయామం ఎంతో దోహదపడుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఖేల్ ఇండియా బ్యాడ్మింటన్ అకాడమీలో ఉద్యోగులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించి హాకీ క్రీడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ క్రీడకు వన్నె తెచ్చి దేశకీర్తిని పెంచిన ఆణిముత్యం ధ్యాన్‌చంద్ అని తెలిపారు. ప్రపంచపోకడ, జ్ఞాన సముపార్జనకు చరవాణిలు అవసరమైన క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని, తద్వారా కండరాలు దృఢ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, అనిల్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోకల్‌బాడి ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

రాబోయే నాలుగైదు నెలల్లో లోకల్‌బాడి ఎన్నికల నిర్వహణ ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ పార్థసారథి అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సెక్రెటరీ లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటరు జాబితా తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈసీఐ నిర్వహించిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అన్ని మార్గదర్శకాలు ఈ స్టేట్ ఎన్నికలు వర్తిస్తాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల ఎంపిక, మెటీరియల్‌తో పాటు పోలింగ్ సిబ్బంది, బందోబస్తు కోసం అధికారులు సైతం ఎక్కువ మొత్తం అవసరం ఉంటుందని తెలిపారు. ఓటరు జాబితా 100 శాతం పూర్తయ్యాక పంచాయతీల్లో ఆ గ్రామ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పబ్లిష్ చేసి ఓటర్ల నుంచి వచ్చే పలు ఆరోపణలు స్వీకరించాలని ప్రతీ కలెక్టరేట్‌లో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎల్‌పీవోలు తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పని బారెడు.. వేతనం మూరెడు!

- పని భారంతో సమగ్ర శిక్ష ఉద్యోగుల ఇబ్బందులు
- జిల్లా వ్యాప్తంగా 685 మంది ఉద్యోగులు
- రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగుల డిమాండ్

మద్నూర్, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. భద్రత లేక నిత్యం ఆందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. చాలీచాలని వేతనంతో నానా అవస్థలు పడుతున్నారు. 2011లో సమగ్ర శిక్ష అభియాన్‌లో సీఆర్పీల వ్యవస్థ అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా సీఆర్పీలు పని చేస్తున్నారు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన వారికి అందే వేతనం అంతంత మాత్రమే. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెగ్యులర్ ఉపాధ్యాయుల కన్నా ఎక్కువ విధులు నిర్వహిస్తున్నా గత ప్రభుత్వం వారి చాకిరిని గుర్తించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కనీస వేతనం అందించడంతో పాటు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేస్తుందేమోనని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 685 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు

జిల్లాలోని ఆయా మండలాల్లో 685 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మండల స్థాయి ఎమ్మార్సీలో పని చేస్తున్న ఎంఐఎస్‌కే కో ఆర్డినేటర్స్ కంప్యూటర్ ఆపరేటర్స్, ఐఆర్పీలు మెసెంజర్ 112 మంది, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ 76, పార్ట్‌టైం ఇన్‌స్పెక్టర్ 71, జిల్లా స్థాయిలో డీపీవో ఆఫీసులో ఏడు బాలికల కస్తూర్బా గురుకుల పాఠశాలలో యూఆర్ఎస్ 490 మంది విధులు నిర్వహిస్తున్నారు. 2012లో గత ప్రభుత్వం కలెక్టర్ చైర్మన్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటిస్తూ బీఈడీ పూర్తి చేసి టెట్ పాసైన అభ్యర్థులను సీఆర్పీలుగా నియమించింది. అనేక సర్వేలు పాఠశాలల్లో ఫోర్త్ క్లాస్ సిబ్బంది పనులు సైతం చేసే విధంగా వారి సేవలను వినియోగించుకుంటున్నారు. 2012లో రూ.5,500లతో ప్రారంభమైన వేతనం ప్రస్తుతం రూ.19,500కు చేరుకుంది. 12 సంవత్సరాల నుంచి విద్యాశాఖలో వెట్టి చాకిరి చేస్తున్నామని, ప్రస్తుతం ఇస్తున్న వేతనం కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదని రోజురోజుకూ పని భారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రూ.28వేల కనీసం వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఇవీ డిమాండ్‌లు..

- కనీస వేతనం రూ.19,500 నుంచి రూ.28 వేలకు పెంచాలి
- ఉద్యోగ భద్రత కల్పించి మహిళ సీఆర్పీలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- పాఠశాలలను సందర్శించినప్పుడు టీఏ, డీఏలతో పాటు సెల్‌ఫోన్ ఇంటర్నెట్ చార్జీలను చెల్లించాలి
- స్టేషనరీ, జిరాక్స్, రవాణా ఖర్చుల కింద ప్రతినెల రూ.2 వేలు అదనంగా ఇవ్వాలి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా వేతనాలు పెంచాలి

● సత్యనారాయణ, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలి. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

నేడు అలీసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల

నవీపేట, ఆగస్టు 29: మండలంలోని కోస్లీలోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా శుక్రవారం ఆయకట్టుకు సాగునీటిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విడుదల చేయనున్నారని ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి తెలిపారు. 2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించి మధ్యాహ్నం 3గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. దీని ద్వారా నవీపేట, రెంజల్, ఎడపల్లి, నిజామాబాద్, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాలకు చెందిన సుమారు 53,793ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ ద్వారా కొత్త కోర్సులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ సోషల్ సైన్సెస్‌లో వివిధ సర్టిఫికెట్, అండర్ గ్రాడ్యుయేట్, డిప్లొమా మరియు పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రాంల కోసం 2024-25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, అసోసియేట్ ప్రొఫెసర్ రాధాకృష్ణలు తెలిపారు. గురువారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఉన్న అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాక్ ఏగ్రేడ్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా విద్యలో నాణ్యమైన ఉన్నత ప్రమాణాలను నిర్వహించడంతో పాటు అర్హత కలిగిన అధ్యాపకులు, మౌలిక సదుపాయాల ద్వారా రెగ్యులర్ యూనివర్సిటీలతో సమానంగా అనేక కోర్సులను అందిస్తున్నామన్నారు. ఆర్థిక పరిమితులు, కట్టుబాట్లు, వివిధ కారణాల వల్ల రెగ్యులర్ కాలేజీలకు హాజరుకాలేని విద్యార్థులకు తమ యూనివర్సిటీ ద్వారా ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఉన్న విద్యను అందిస్తున్నామన్నారు. స్కిల్ కోర్సులు, మల్టీ మీడియా లెర్నింగ్ నేటి పోటీ ప్రపంచంలో విస్తృత వ్యాప్తి ఉన్నందున వాటిని సైతం అందిస్తున్నామని అన్నారు. యూనివర్సిటీ ద్వారా ప్రతి ఒక్కరికి విద్యను అందించేందుకు వివిధ జిల్లాల్లో అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అందిస్తున్న కోర్సులలో చేరాలన్నారు. ఈ సమావేశంలో గిరిరాజ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ రంజిత పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పెద్దబజార్, ఆగస్టు 29: పీఆర్‌సీ కమిటీని వెంటనే రిపోర్ట్ విడుదల చేసేలా 30 శాతం ఫిట్‌మెంట్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం పెన్షనర్స్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇప్పటి వరకు నాలుగు డీఏలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని వీరి మూలంగా రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భోజారావు, కార్యదర్శి మధన్‌మోహన్, కోశాధికారి నారాయణ, వీరయ్య, నాయకులు వెంకట్రావ్, సిర్పహన్మాండ్లు, దీన సుజన, ప్రసాద్‌రావు, రాధాకృష్ణా, సిర్పలింగం పాల్గొన్నారు.

రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

పెద్దబజార్, ఆగస్టు 29: రైతులందరికీ రెండు లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డీవో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆగస్టు 15వరకు రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి 31వేల కోట్ల రూపాయలకు గాను 18వేల కోట్ల రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేయడంతో అనేక మంది రైతులకు రుణమాఫీ కాక కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్రమైన మానసిక వేదనతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. చిన్న చిన్న కారణాలు చూపుతూ ప్రభుత్వం నిబంధనలను సడలించకపోవడంతో రుణమాఫీ వర్తించడం లేదని తిరిగి దరఖాస్తులు తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పడం జరుగుతుందని రైతులు మనోవేదనను అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. రుణాలు తీసుకున్న రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయడానికి కావాల్సిన నిధులను విడుదల చేసి నిబంధనలను సడలించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులందరికీ పంట పండించే వారికి ఎకరానికి 15వేల రూపాయలు రైతుభరోసాను ఇస్తామని హామీ ఇచ్చి రెండు పంటలు గడిచినప్పటికీ రైతుభరోసా ఇవ్వలేదని వెంటనే రైతులందరికీ ఎకరానికి 15వేల రూపాయలు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ సమక్షంలో రైతుల పంటలకు అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చి గత రెండు సీజన్‌లో అమలు జరగలేదన్నారు. ఇప్పుడు కేవలం సన్న వరి ధాన్యానికి మాత్రమే చెల్లిస్తామని తెలియజేస్తున్నామని చెప్పడం దీనిమూలంగా రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసాను, పంటలకు బోనస్ ధరను అమలు జరపాలని ఆయన అన్నారు. లేని యెడల ప్రభుత్వానికి రైతాంగం తమ పోరాటాల ద్వారా గుణపాఠం చెప్పే పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుజాత, కటారి రాములు, నర్సయ్య, కృష్ణ, సతీష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌ల పంపిణీ

డిచ్‌పల్లి, ఆగస్టు 29: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో స్పోర్ట్స్ డే సందర్భంగా జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌లను డిచ్‌పల్లి గల్ఫ్ చేయూత సంఘం సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌లో ఫస్ట్, సెకండ్ వచ్చిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతయ్య, గల్ఫ్ చేయూత సంఘ సభ్యులు తులసిదాస్, అశోక్, మురళి, కృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సిరికొండ, ఆగస్టు 29: గణేష్ ఉత్సవాలను ప్రజలు, యువజన సంఘాల వారు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఎల్.రామ్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం సిరికొండ పోలీసు స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో మండంలోని వివిధగ్రామాల్లో ఏర్పాటైన గణేష్ మండళ్ల సంఘాల సభ్యులు, అన్ని మతాల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పదకొండు రోజుల పాటు వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంతంగా, ఆనందోత్సవాల మధ్య ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్సై సూచించారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

బోధన్‌టౌన్, ఆగస్టు 29: ఆర్య వైశ్యుల కులస్థుల ఆరాధ్య కుల దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అని అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని గౌరవ అధ్యక్షులు కొత్త రాజేశ్వర్, అధ్యక్షులు గంజి వెంకటేశంలు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి హోమం, చండీ హోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి యొక్క విశిష్టతను వివరించారు. అమ్మవారిని పూజిస్తే సకల శుభాలతో పాటు అష్ట ఐశ్వరాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కంటాల రమేష్, కోశాధికారి పబ్బ మురళి, చిద్ర ప్రదీప్ గుప్తా, కొత్త రవీందర్, బిళ్ల కంటి అనిల్‌లతో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి

ఎడపల్లి, ఆగస్టు 29: మండలంలోని పోచారం గ్రామంలో గురువారం సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్, మల్లేష్, కాశం రవి, సంతోష్, హనుమంతు తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

రుద్రూరు, ఆగస్టు 29: సెప్టెంబరు 2 నుంచి చేపట్టే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రుద్రూరు మండల ఇంచార్జి మోహన్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ గ్రామాన తిరుగుతూ పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, సాయినాథ్, పార్వతి మురళీ, రాజారామ్, శానం బాలు, మండల నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ధర్పల్లిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ధర్పల్లి, ఆగస్టు 29: మండల కేంద్రంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. తెలుగు భాషా విభాగాధిపతి ప్రభాకర్ మాట్లాడుతూ భాషా ఉద్యమ నేపథ్యాన్ని రామ్మూర్తి కృషిని ఈ సందర్భంగా వివరించారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ అందరూ తెలుగు భాషను చక్కగా నేర్చుకోవాలని తెలుగు భాషలోనే వ్యవహరించాలని తెలుగు భాష వారసత్వాన్ని తర్వాతి తరాలకు పదిలంగా అందించాలని పేర్కొన్నారు.ఈసమావేశంలో వక్తలు తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ రామ్, అధ్యాపకులు రవిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, వెంకటకిషన్, శారద, గంగాధర్, సంజీవ్, పద్మ, తబస్సుం, సరిత,నిహారిక, సంధ్యారాణి, సరళ, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ:తెలుగు భాషా,క్రీడల దినోత్సవం సందర్భంగా సిరికొండ మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు,విద్యార్థులు నివాళి అర్పించారు. సిరికొండ మండల కేంద్రంలో ఆదర్శపాఠశాల, సత్యాశోధక్, ప్రతిభ పాఠశాలల్లో విద్యార్థులకు పరుగు పందెం, వ్యాసరచన,ఉపన్యాస, కవితల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్స్‌పల్, హెచ్‌ఎం బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో వైస్‌ప్రిన్స్‌పల్,హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పద్యభాగంలో పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుబాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పరబాష మోజులో పడి తెలుగుబాష అందరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తెలుగుబాష గొప్పతనాన్ని, తెలుగుబాష మహత్యం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగుబాష ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజీయోద్దిన్‌ఆస్లాం, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు29: ఆలూర్ మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న అఖిల్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు మట్కా నిర్వహిస్తున్న స్థావరాన్ని తనిఖీలు చేయగా మట్కా చిట్టిలతో పాటు రూ.1300లను స్వాధీనం చేసుకొని అఖిల్‌ను అరెస్టు చేసి కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎత్తొండలో మూడు గేదెలు మాయం

కోటగిరి,ఆగస్టు29: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో మూడు గేదెలు మాయమైనట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన అగ్గు లింగయ్య అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో మూడు గేదెలను కట్టేసి ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. ఉదయం లేచి చూసే సరికి పాకలో మూడు గేదెలు కనపడలేదు. వాటి కోసం వెతికిన దొరకకపోవడంతో బాధితుడ లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



టీయూలో గోపీచంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం



నవీపేట మోడల్ పాఠశాలలో ...

సుభాష్‌నగర్, ఆగస్టు 29:విధి నిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు జాతీయ క్రీడా దినోత్సవం రోజు క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమని టిఎన్‌జివోల జిల్లా అధ్యక్షుడు ఉద్యోగ జెఏసి ఛైర్మన్ అలుక కిషన్ అన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పచ్చజెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, బాక్సింగ్ కోచ్ శంషొద్దీన్, టిఎన్‌జివోస్ కార్యదర్శి శేఖర్, సహ అధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, టిజివో అధ్యక్షుడు అమృత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మానసిక వికాసానికి విద్యతో పాటు క్రీడలు అత్యంత ప్రధానం అని టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. గురువారం భారతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ స్పోర్ట్స్‌డేను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సైనికుడిగా కొనసాగిన ధ్యాన్‌చంద్ అంతర్జాతీయంగా హాకీ క్రీడాకు గుర్తింపు తేవడం భారతదేహానికి గర్వకరాణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, చీఫ్ వార్డెన్ మహేందర్ రెడ్డి, పిఆర్‌వో పున్నయ్య, నేత, నరేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, మోకన్‌పల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడ దినోత్సవం నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా మోడల్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులకు సైతం రగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో సైతం విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, పీడీ, కస్తూర్బా బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రాణి, పీఈటీ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ధర్పల్లి: నేటి యువత ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోగల పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కరస్పాండెంట్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

రెంజల్: మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నేషనల్ క్రీడ దినోత్సవం సందర్భంగా రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించారు. ఇట్టి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, క్రీడ పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్:ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో కరస్పాండెంట్ షఫీ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సన, ప్రధానోపాధ్యాయుడు రాధకృష్ణన్‌నాయర్,వ్యాయమ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో గురువారం క్రీడాకారులను పట్టుశాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, అంబల్ల తిరుపతి, ఫిజికల్ డైరెక్టర్ రిటైర్డు కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి,హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రాజేష్, ఉపాధ్యాయులు పీడీ రాజేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ తప్పనిసరి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు29: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ తప్పనిసరి అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చేపూర్ క్షత్రీయ పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి అంతర్ పాఠశాలల రూరల్ క్రీడలను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం, శారీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. గెలుపు ఓటమిలు సమానంగా తీసుకొని ఓడిన ప్రతీసారి నిలబడి గెలవడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే అధికంగా చదువుతారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. విద్య, ఆరోగ్యంకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం తన ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాణించి ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. విద్యార్థుల నైపుణ్యం దేశానికి ఉపయోగపడాలని,విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల బాధ్య తతో వ్యవహారించాలని, తమ పిల్లల నడవడిని నిత్యం గమనించాల న్నారు. మండలస్థాయి క్రీడలకు 12పాఠశాలల నుంచి క్రీడాకారులు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొంటున్నాయి. అంతకు ముందు జ్యోతిప్రజ్వాలన చేసి క్రీడలను ప్రారంభిం చి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, క్షత్రీయ విద్యా సంస్థల ఛైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, క్రీడల కన్వీనర్ చేతనకుమారి, కోకన్వీనర్ నర్సింహస్వామి, ఆర్గనైజ్ కార్యదర్శి గంగాధర్, కో ఆర్గనైజింగ్ కార్యదర్శి బ్రిజేష్, పీడీలు,పీఈటీలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులు గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్

వేల్పూర్,ఆగస్టు29:వేల్పూర్ మండలంలో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ దిశ నిర్దేశం చేశారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మోహన్ మాట్లాడారు. సెప్టెంబర్‌లో జరిగబోయే పార్టీ సభ్యత్వ గురించి వివరిస్తూ సభ్యత్వ నమోదుకు విజయవంతం చేయడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. బీజేపీ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేస్తూ లక్ష్యానికి మించి పార్టీ సభ్యత్వం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్య దర్శులు వలం రవి, లగిశెట్టి బానుచందర్; నర్సారెడ్డి, నగేష్, రమేష్‌రెడ్డి, లింగన్న, రాజ్‌కుమార్, రఘుపతి, నర్సాగౌడ్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

గ్రామాల్లో రుణమాఫీపై ఇంటింటి సర్వే

సిరికొండ ఆగస్టు 29 :రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణ మాఫీ పథకంలో రుణాలు మాఫీ కాని రైతుల ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నట్లు మండల నోడల్ వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.రుణాలు మాఫీ కాలేదని 940మంది రైతులు ధరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు.రేషన్‌కార్డు లేని రైతులు 730 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.గురువారం హాస్సేన్‌నగర్ గ్రామంలో రేషన్‌కార్డు లేకుండా రుణాలు మాఫీకాని రైతులను ఇంటింటికివెళ్లి విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. ఇలా రోజుకో గ్రామానికి వెళ్లి విచారిస్తున్నట్లు నోడల్ అధికారి చెప్పారు.

వేల్పూర్:మండలం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వేల్పూర్ మండలం మోతెలో రుణమాఫీపై మండల వ్యవ సా యాధికారిణి శృతి ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిం చారు. గ్రామంలో ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు నమోదు

వేల్పూర్, ఆగస్టు29: పెట్రోలింగ్ చేస్తున్న పెట్రోలింగ్ పార్టీ పోలీసుల చట్టపరమైన విధులకు అటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగనాథ్ తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో పోలీసులు నిర్వహిస్తున్నపెట్రోలింగ్‌లో భాగంగావెంకటా పూర్ గ్రామానికి చేరుకునే సరికి ఆరేపల్లి అర్వింద్, గైన్మిది జనార్ధన్ యాదవ్ అలియాస్ ధనుంజయ్‌తో పాటు మరికొంత మంది అర్వింద్ డిజేషాప్ వద్ద గుమ్మిగుడి ఉన్నారు.పోలీసులు వారిని మందలిం చగా అర్వింద్, గైనిమీద జనార్ధన్‌యాదవ్‌లు పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు అటంకం కలిగించినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జనార్ధన్ యాదవ్ జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించగా అర్వింద్ పరారీలో ఉన్నాడన్నారు.

వేంపల్లిలో యువకుడి అదృశ్యం

ముప్కాల్, ఆగస్టు29: మండలంలోని వేంపల్లికి చెందిన దండుగుల రమేష్ అదృశ్యమైనట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఈనెల 27న ఆర్మూర్ వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళిన రమేష్ ఇప్పటికీ రాకపోవడంతో గురువారం రమేష్ భార్య సుమలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చివేత



నవీపేటలో రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చివేస్తున్న సిబ్బంది

నవీపేట, ఆగస్టు 29 : నవీపేటలోని తడగామ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతను గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేయించారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాలని అనే కథనానికి అధికారులు స్పందించారు. నవీపేట నుంచి నందిపేటకు వెళ్లే రహదారిపై ఈ భారీ సైజు గుంత ఏర్పడడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ఇటీవల ప్రమాదం బారిన పడ్డారు. ఈ విషయంపై స్పందించిన ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రోడ్డుపై గుంతను కంకర, మొరంతో పూడ్చివేశారు.

క్రషర్‌ను తొలగించాలని సీఎంకు ఫిర్యాదు

బాన్సువాడ, ఆగస్టు 29 : మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి అనుకొని ఉన్న స్టోన్ క్రషర్‌లను తక్షణమే తొలగించాలని గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌లకు పోస్టు ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు. నివాసాలకు అనుకొని ఉన్న స్టోన్‌క్రషర్లు గత 30 సంవత్సరాల నుంచి నడుస్తున్నాయని, వీటి బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్ళు బీటలు వారుతున్నాయని పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌ల శబ్దాలు, దుమ్ము, డాంబర్ దుర్వాసన, పొగ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. గతంలో అధికారులకు, నాయకులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, ఇష్టానుసారంగా రాత్రుల్లో భారీ బ్లాస్టింగ్ చేస్తున్నారని, రాత్రిళ్ళు నిద్రలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ క్లినిక్ మూసివేత



సీజ్‌చేస్తున్న అధికారులు

రామారెడ్డి, ఆగస్టు 29 : రామారెడ్డి మండల కేంద్రంలో ప్రైవేట్ క్లీనిక్‌ను సీజ్‌చేసినట్లు మండల వైద్యాధికారి సురేష్ తెలిపారు. అర్హతలు లేకుండా ఇష్టారీతిన మందులు రాస్తున్నారని కేవలం ప్రాథమిక చికిత్స అందించాల్సి ఉండగా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, తనిఖీలో బయటపడిందని దీంతో సదరు క్లీనిక్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అన్నారం పీహెచ్‌సీ వైద్యురాలు మానసక్లీనిక్‌ను పరిశీలించి ఇష్టారీతిన మందులు రాస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, ఫార్మసిస్ట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదు సెల్‌ఫోన్‌ల స్వాధీనం

బోధన్‌రూరల్, ఆగస్టు 29 : గుర్తు తెలియని దొంగలు అపహరించిన ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లను యజమానులకు అందజేస్తున్నామన్నారు. ఫిర్యాదుదారులు చంద్రశేఖర్, గఫూర్ మాలిక్, గోపి, మహ్మద్ హజురుద్దీన్, నవీన్‌లకు సంబంధించిన ఐదు ఫోన్‌లను సీఈఐఆర్‌ల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న పోన్‌లను ఫిర్యాదుదారులకు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ విలువైన సెల్‌ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ధర్నా

ఆర్మూర్ రూరల్, ఆగస్టు 29 : రైతులందరికీ షరతులు లేకుండా రుణమఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని, రేషన్‌కార్డు నిబంధనను తొలగించి పట్టాపాస్ పుస్తకంపై రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న దానికి సంబంధం లేకుండా ప్రభుత్వం రూ.2లక్షల రైతు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములకు కూడా రైతు రుణమాఫీ, రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రుణమాఫీ అయిన రైతులందరికి మళ్ళీ కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి రైతు బంధు, రుణమాఫీ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తోగటి భూమన్న, ఓంకార్, కిషన్, నవీద్, గణేష్, అన్వీర్‌ఖాన్, జయ, అజయ్, రఫిక్ పాల్గొన్నారు.

కామారెడ్డిరూరల్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తు గురువారం కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని తెలంగాణ గ్రామీణబ్యాంక్ వద్దరోడ్డుపై కూర్చుని రైతులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరైతుకురుణమాఫీచేస్తామని చెప్పి ప్రభుత్వం ఈ రకంగా చేయడం సమంజసం కాదని తెలిపారు. ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని ఇప్పుడు రేషన్‌కార్డు ప్రతిపాదకన రుణమాఫీచేస్తామనడం తగదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామని లేదంటే పెద్దఎత్తున నిరసన తెలుపుతామని అన్నా రు.రైతులు రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపడంతో వ్యవసాయాధికారులు వచ్చి నచ్చచెప్పడంతో ధర్నావిరమించారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్,మోహన్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, అమృతరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

రైతుల పడిగాపులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 29 : రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా గురువారం జక్రాన్‌పల్లిలోని మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు చేసుకోవడానికి తరలివచ్చారు. ఈ దరఖాస్తులు చేసుకోవడానికి రైతులు వ్యవసాయ కార్యాలయం ఎదుట రచ్చబండ వద్ద పడిగాపులు కాశారు. ఈ రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు రైతులు కార్యాలయానికి రాగా రేషన్‌కార్డుతో పాటు ఇతర పత్రాలు జతపర్చాలని అధికారులు తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రేషన్‌కార్డులు లేకుండా దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటించినప్పటికీ అధికారులు రేషన్‌కార్డును జతపర్చాలని చెబుతున్నారని, దీంతో కొందరు రైతులకు రేషన్‌కార్డు లేని వారి పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి రుణమాఫీ కానీ దరఖాస్తులను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి'

బోధన్‌రూరల్, ఆగస్టు 29 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజరి గంగారాంలు అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ట్రస్ట్ అధినేత ఆయేషా ఫాతిమా జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులను, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయేషా ఫాతిమా తమ ట్రస్ట్ ద్వారా 1500మంది పిల్లలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారని గుర్తు చేశారు. నిరుపేదల కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుధారాణి, బీఆర్ఎస్ నాయకులు మొబిన్ ఖాన్, ఎన్ఆర్ఐ హైమద్, నాగుల శంకర్ శంకర్ గౌడ్, సాగర్, నసీర్, ప్రవీణ్ నాయక్, నరేష్ కుమార్, దేవ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

రెంజల్,ఆగస్టు29: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయానికి అనుకుని ఉన్నట్టువంటి 340 సర్వే నెంబర్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గతంలో హైకోర్టులో కేసు వేయడం జరిగిందని గత నెలలో హైకోర్టు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తీర్పు ఇవ్వడం జరిగిందని కోర్టు తీర్పును గౌరవిస్తూ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌కు బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో 340సర్వే నెంబర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి అనుకుని ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించిన కూడా చర్యలు చేపట్టకపోవడంతో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని, 2017లో హైకోర్టులో ఫిర్యాదు చేయడంతో జులై నెలలో తీర్పు వెలువడిందని, తహసీల్దార్ కార్యాలయానికి అనుకుని ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తీర్పు వెలువరించడం జరిగిందని, ఇట్టి కాపీని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. అక్రమ నిర్మాణం తొలగించాలని, లేనిపక్షంలో రాస్తారోకోలు చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల రాజు, మాజీ మండల అధ్యక్షులు చుక్క రాజు, పార్థ రమేష్, లోల ఒడ్డెన్న, సగ్గు రవి, యోగేష్, శివ, రాకేష్, గాండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

భీమ్‌గల్, ఆగస్టు29: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది గురువారం భీమ్‌గల్ పట్టణంలో ముచ్కూర్ చౌరస్తా వద్ద వ్యాపా రులకు, ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వ్యాపార సముదాయాలు, నివాసగృహాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సీవోలు, డీసీపీ పౌడర్ లాంటివి వాడకం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, ఇలాంటి సమయంలో ఏసీలు, లిఫ్టులు వాడకూడదని తెలిపారు. అలాగే నివాసగృహాల్లో వాడే సిలిండర్ వల్ల ప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మధుసుదన్, శ్రీనివాస్, భూమేశ్వర్, గంగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల మరమ్మతు పనులు ప్రారంభం

మోర్తాడ్, ఆగస్టు 29 : మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామం చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి మరమ్మతు పనులకు రూ.44లక్షలు మంజూరు కాగా గురువారం కాంగ్రెస్ నాయకులు పనులను ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామంలోని చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకంలో పైప్‌లైన్ లీకేజీ వల్ల నీటి సరఫరా సమస్య తలెత్తడంతో బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు తెలుపగా వెంటనే స్పందించారు. దీంతో మరమ్మతులకు కావాల్సిన నిధులను సునీల్‌కుమార్ మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దాం

● టీడీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడు

బోధన్‌రూరల్, ఆగస్టు 29: బోధన్‌లో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువద్దామని పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.ఉదయ్ భాస్కర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో పోరుకు సిద్దంగా ఉండాలని, పార్టీ సంస్థగతంగా బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పార్టీని వదిలి వెళ్లిన కార్యకర్తలు, పదవులను అనుభవించిన వారు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల వద్దకే పాలన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించబడ్డాయని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు తదితరులున్నారు

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కోటగిరి,ఆగస్టు29: పొతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు ఇతర జబ్బులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి నారాయణ రావు, వైద్యులు రాధిక, కరణ్, వెంకటేష్, శ్రావ్య, సిబ్బంది సుజాత, సావిత్రి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలి

● భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్

కమ్మర్‌పల్లి, ఆగస్టు 29: విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉంటు శ్రద్ధబుద్ధులతో, క్రమశిక్షణతో చదివి ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలని భీమ్‌గల్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని శ్రీభాషిత జూనియర్ కళాశాలలో ద్వితీయసంవత్సరం ఇంటర్‌మీడియట్ విద్యార్థులు మొదటిసంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వెల్‌కం పార్టీలో ముఖ్యఅతిధిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇంటర్మీడియట్‌అనేది విద్యార్థిదశకు కీలకమని భవిష్యత్తులో ఉదోయగాలు సంపాదించుకునేందు కృషిచేస్తారని అన్నారు విద్యార్థులు సమయాన్ని వృధిచేయకుండా బాగాచదివి వార్షికపరీక్షలు, పోటీపరీక్షలుకు హాజరవ్వాని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఉన్నత లక్ష్యాన్ని చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలకోసం పాటుపడాలని, మార్చ్‌లో జరిగే వార్షిక పరీక్షలోల విజయం సాదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన అకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ , కరస్పాండెంట్ రాజశేఖర్, డైరెక్టర్‌లు సుంకెట రవి, సిలివేరి సంజీవ్,మాలవత్ సంతోష్, అధ్యాపకులు శ్రీనివాస్, గజానంద్, శ్రీధర్, జంజిత్, రాజేష్, శృతి, చైతన్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు సన్మానం

ముప్కాల్, ఆగస్టు29: ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం సన్మానించారు. ట్రిబుల్ ఐటి సాధించిన విద్యార్థులు ప్రశాంత్, కార్తికేయచారి, రచన్, వైశాలి, ఎస్.వైశాలి, రచనలను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యా యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, రవికుమార్, ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ ఆఫీస్‌కు తరలివచ్చిన వ్యాపారస్తులు

హత్యచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 29 : కామారెడ్డి పట్టణంలోని శివాలయం వద్ద వ్యాపారి శ్రీపాత విశ్వనాథంపై దాడిచేసి అతను చనిపోయేందుకు కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఎస్పీ సింధూశర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాలయం వద్ద పాత విశ్వనాథంపై కక్షపూరితంగా దాడిచేయడంతో అతను మరణించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనతో వ్యాపారస్తులు తీవ్ర భయందోళనకు గువుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలతో వ్యాపారాలు కుంటుపడి, కామారెడ్డి అభివృద్ధికి ఆటంకం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోమారు పునరావృతం కాకుండా బాధ్యులైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

విశ్వనాథం హత్యవెనుక ఉన్న వారిని ఎవరిని వదిలిపెట్టవద్దు..

వ్యాపారి పాత విశ్వనాథం హత్యవెనుక ఉన్న వారిని ఎవరిని వదిలిపెట్టవద్దని ఎస్పీ సింధూశర్మను కోరుతున్నానని డీ సీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరాలకు డబ్బులు వడ్డీకి తీసుకుని అవి తిరిగి ఇవ్వకుండా అడిగితే హత్య చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

గురుకులం నుంచి హాకీపోటీలకు తరలివెళ్లిన బాలికలు

మద్నూర్, ఆగస్టు 29 : జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించు కుని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న హాకీపోటీలకు మద్నూర్ మం డలం పెద్దఎక్లారా బాలికల గురుకుల పాఠశాల నుంచి 12 మంది బాలికలు హాకీపోటీలకు వెళ్లినట్లు పీటీ మౌనిక తెలిపారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గౌరవ సూచికంగా ఆయన పుట్టిన రో జును పురస్కరించుకుని ప్రతి సంవత్సరం 29 ఆగస్టును క్రీడా దినో త్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉత్తమ క్రీడాకారులకు శిక్ష కులకు అవార్డులు ఇచ్చి గౌరవిస్తారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో హాకీపోటీలను నిర్వహిస్తారు. ఆ పోటీలకు గురుకుల పాఠశాల నుంచి 12 మంది ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు.

పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలి

బిచ్కుంద,ఆగస్టు 29: గ్రామంలోని ఇంటిపరిసర ప్రాంతాలు, వీధులన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బీసీబాలికల, బాలుర వసతి గృహాలను మండల ప్రత్యేకాధికారి జడ్పీ సీఈఓ చందర్‌నాయక్ తనిఖీ చేపట్టారు. వసతి గృహంలోని వంటసామగ్రి, కూరగాయలు విద్యార్థులకు అందించే భోజనాన్ని వసతి గృహ పరిసర ప్రాంతాలన్నింటినీ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల్, బిచ్కుంద గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరమ్మ ఆలయంలో చోరీ

లింగంపేట, ఆగస్ట్ 29 : లింగంపేట మండలంలోని కోమట్‌పల్లిలో వెలసిన అల్లూరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. అలయంలోని హుండీని పగులగొట్టి హుండీలో భక్తులు వేసిన నగుదతో పాటు ఇతర కానుకలను దోచుకుపోయినట్లు వారు తెలిపారు. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

9 మంది డీజే నిర్వాహకుల బైండోవర్

లింగంపేట, ఆగస్ట్ 29 : మండలంలో డీజే, సౌండ్ సిస్టమ్‌లను నడుపుతున్న తొమ్మిది మందిని గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలలో డీజేలు పెట్టరాదని ఆయన తెలిపారు. డీజే నిర్వాహకులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా వారిని రూ.లక్ష పూచికత్తుపై విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగించి డీజేలను పెట్టినట్లయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలి

రాజంపేట,ఆగస్టు 29 : రాజంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఏర్పాటు చేసిన ఫిఫిర్యాదు పెట్టెలోని ఫిర్యాదులు రెవెన్యూ రేషన్‌కార్డుల సమస్య, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించాలని తహసీల్ధార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి సంపత్‌రెడ్డి, నాయకులు సంతోష్, రాము, రమేష్, మనోహర్, సాయిరెడ్డి, బాల్‌నర్సు, గంగారాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేత ఘటనపై లోకాయుక్త విచారణ

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 29 : పెద్ద కొడప్‌గల్ గ్రామ పంచాయతీ పరి ధిలో గల రామారావు తండా పరిధిలో ఇల్లు కూల్చివేత ఘటనపై గురువారం లోకాయుక్త కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. గత మూడు సంవత్సరాల క్రితం తండా పరిధిలో ఓ వ్యక్తి ఇల్లు నిర్మాణం చేయగా. అప్పట్లో అటవీ శాఖ అధికారులు తమ ఇల్లు కూల్చివేశారని లోకాయుక్తలో పిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లోకాయుక్త సభ్యులు మాతిక్ కోషి విచారణ చేపట్టారు. బాధితుడితో పాటు, అధికారుల వివరణ తీసుకున్న లోకాయుక్త సభ్యులు మాతిక్‌కోషి ఇరువురి వాదనలు విన్న అనంతరం ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పిట్లం రేంజ్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో సంతోష, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, బీట్ అధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- ఏడుగురికి గాయాలు

బీర్కూర్, ఆగస్టు 29 : మండల కేంద్రంలో బుధవారం రాత్రి డబ్బుల విషయమై అన్నదమ్ముల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన చామకూర నర్సవ్వకు శంకర్, మాధవ్‌లు ఇద్దరు కుమారులున్నారు. అయితే నర్సవ్వ కొన్నిరోజులు శంకర్ ఇంట్లో, మరికొన్ని రోజులు మాధవ్ ఇంట్లో వంతుల వారీగా ఉండేది. ఇదిలా ఉండగా రాఖీ పండుగ రోజు నర్సవ్వ మృతిచెందింది. బయట బాకీ తెచ్చి తల్లి అంత్యక్రియలు నిర్వ హించారు. అనంతరం మిగిలిన కార్యక్రమాలు పూర్తిచేశారు. బాకీ డబ్బులు కట్టే విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవకు దారితీసింది. అమ్మని దగ్గర దాచి ఉంచిన పెన్షన్ డబ్బులు లక్ష రూపాయల నుంచి బాకీ డబ్బులు చెల్లించాలని శంకర్ మాధవ్‌ను అనడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. తనవద్ద అమ్మ ఏ డబ్బులు దాచ లేదని మాధ వ్ చెప్పడంతో గొడవ జరిగి ఘర్షణకు దారితీసింది. అన్నదమ్ములతో పాటు ఇరు కుటుంబాల సభ్యులు ఇటుకలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. ముగ్గురి తలలు పగిలాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శంకర్‌తో పాటు ఆయన కుమారుడు బాబు లాల్, కోడలు రజిత, కుమార్తె గంగమనిలు గాయపడ్డారు. అలాగే మాదవ్‌తో పాటు ఆయన భార్య నాగమణి, రాములు గాయపడ్డారు. ఏడుగురిని 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆసు పత్రికి తరలించారు. ముగ్గురి తలలకు కుట్లు పడ్డాయి. మాధవ్, నాగ మనిల పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.



ఘర్షణలో గాయపడిన శంకర్

ఘనంగా క్రీడా దినోత్సవం

భిక్కనూరు, ఆగస్టు 29 : విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ అన్నారు. గురువారం భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయాగ్రామాల్లో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా భిక్కనూరు మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ నుంచి సినిమా టాకీసు చౌరస్తా వరకు స్థానిక విజ్ఞాన్ పాఠశాల ఆధ్వ ర్యంలో 1కె రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. త్రిసహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌భాస్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల ఎల్లారెడ్డిలో గురువారం స్పోర్ట్స్ డే, తెలుగుభాష దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ మహ్మద్ రవత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్పోర్ట్స్ డే, తెలుగు వర్ణమాలలోని తొలి అక్షరాల ఆకారంలో కూర్చుని అబ్బురపరిచారు.

గాంధారి : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం గాంధారి వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మన్‌రాథోడ్ ఆధ్వ ర్యంలో ఆయనకు హాకీ స్టిక్ ఆకారంలో కూర్చుని ఆరోతరగతి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ హాకీ క్రీడాకారుడు భారతదేశంలో జన్మించడం గర్వకారణం అన్నారు.



ఎల్లారెడ్డిలో స్పోర్ట్స్ డే దినోత్సవం

సదాశివనగర్: మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేందర్ అన్నారు. గురువారం జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని నేటి సమాజంలో విద్యార్థులకు క్రీడలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆదర్శ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, జాతీయ తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భానుమతి,రాజేశేఖర్, చిత్ర,లింగమయ్య, దశరథ్, విద్యారమణ, అనితశర్మ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో గురువారం క్రీడాభారతీ ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడాపోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ మాట్లాడుతూ ప్రతి ఆటగాడు ఒక సైనికుడిలా నిరంతరం సాధన చేస్తు ఉండాలని, విద్యార్థులకుశారీరక శ్రమతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో క్రీడాభారతీ జిల్లా అధ్యక్షుడు కోమిరెడ్డి మారుతి, సెక్రటరీ శ్రీనివాస్, సాయినాథ్, మహిపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : విద్యార్థి దశలోనే చదువుతో పాటుగా క్రీడలు ఎంతో అవసరమని సీఐ సంపత్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం గడికోటలో క్రీడాకారులకు ప్రైజ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంపత్ కుమార్, ఎంపీడీవో ప్రవీణ్ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతీయువకులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్,తహసీల్దార్ సంజయ్‌రావ్, ఎస్సై ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నల్లవు అంజలి, శ్రీనివాస్, బొమ్మెర రవీందర్, నేతుల గణేష్, వెంకటలక్ష్మి, నాగరపు హరీష్ కుమార్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

ఎల్లారెడ్డి, ఆగస్టు 29 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలలో గణేష్ మండపాలు నిర్వహించేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకుల వివరాలు కూడా అందించాలని అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించి ముందస్తుగా తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. గణేష్ నిమజ్జనం ర్యాలీలో డీజేలకు అనుమతి లేదని నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ అన్నారు.

'శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలి'

భిక్కనూరు, ఆగస్టు 29: భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ ఈవో శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో అభివృద్ధి పేరిట వచ్చిన చందాల వివరాలు, చేపట్టిన పనులు, ఆడిట్ వివరాలు, రిసిప్ట్ బుక్కుల వివరాలను ఇవ్వాలని సమాచారం చట్టం కింద ఈవోకు దరఖాస్తు ద్వారా కోరగా 30 రోజులు దాటినా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.

అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు సేవలు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 29: అత్యుత్తమ సాంకేతికతో వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.ఆధునాతన సాంకేతికపద్దతులు అవలంభిస్తున్నామని అన్నారు. వినియోగదారునికి కలిగే అంతరాయం సగటున ఎన్నిసార్లు జరిగిన అంతరాయంపై రియల్‌టైం డాటాను క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదికరించి అంతరాయాలు జరగకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 29 : పంటల వివరాల నమోదును పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామ పంచాయితీ పరిధిలోని హిమగిరి శివారులో పంటల నమోదు వివరాలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులకు వివిధ పంటల సస్యరక్షణ చర్యల గురించి పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ముఖి, సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గుపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 29: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు పండరి నాథ్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 18 గర్భకోశ చికిత్సలు, 46 పశువులకు సాధారణ చికిత్స, 26 దూడలకు నట్టల నివారణ మందు, 2 గేదేలకు కృత్రిమ గర్భదారణ చికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం అవసరం ఉన్న రైతుల పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సాయిలు, సూపర్ వైజర్ బస్వరాజ్, గోపాల మిత్రులు రవీందర్, గంగాధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాలలో వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టండి'

పెద్దకొడప్‌గల్. ఆగస్టు 29 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున గ్రామాలలో వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గురువారం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

'చలో విద్యుత్ సౌదాను విజయవంతం చేయండి'

బాన్సువాడటౌన్ , ఆగష్టు 29 : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 4న తలపెట్టిన చలో విద్యుత్‌సౌదా మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌డివిజన్ బీసీ, ఓసీ విద్యుత్ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి సభ్యులున్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా పోస్టర్‌ను గురువారం కామారెడ్డి జిల్లా విద్యుత్ ఉద్యోగుల అధ్యక్షుడు వెంకటేశం చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులలో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గౌరవ సిట్టింగ్ జడ్జి లేదా జుడిషయల్ కమిషనర్‌తో విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'పంట రుణాల రెన్యువల్ పూర్తి'

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 29 : పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో గల కెనరా బ్యాంక్‌లో 90 శాతం పంట రుణాలు రెన్యువల్ పూర్తి అయినట్లు ఏవో కిషన్ తెలిపారు. గురువారం కెనరాబ్యాంక్‌లో మేనేజర్ గోపాల్‌తో కలిసి రైతుల పంట రుణాల మాఫీ, రెన్యువల్ విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతు కెనరా బ్యాంక్‌లో రైతులకు సంబంధించి 1420 ఖాతాలు ఉండగా, వాటిలో 1150 ఖాతాలను రుణమాపీ చేసి పంట రుణం రెన్యువల్ చేయడం జరిగిందని తెలిపారు.

అన్నారం గ్రామశివారులో యువకుడి మృతి

రామారెడ్డి, ఆగస్టు 29 : రామారెడ్డి మండలం అన్నారం గ్రామశివారులో తండా సమీపంలో ఎల్లంపేట గ్రామానికి చెందిన భూక్యశంకర్ (35) అనే యువకుడు బుధవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతుని భార్య రెండు రోజుల క్రితం సంసారం విషయంలో గొడవపడి అన్నారంలోని తల్లిగారింటికి వెళ్లింది.మృతుడు తన భార్యకోసం బుధవారం అన్నారం వచ్చి కట్టెల కోసం వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు.రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. అన్నారం గ్రామశివారులోని కల్వర్టు వద్ద చనిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు,కుటుంబీకులకు సమాచారం అందించారు.దీంతో మృతుడు అన్న భూక్యరవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయకులు సమయపాల నను ఏ మాత్రం పాటించడం లేదు. మండలంలోని రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటల వరకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యా ర్థులు పాఠశాల బయట ఉండి ఉపాధ్యాయుని రాకకోసం ఎదురుచూశారు. పాఠ శాల ఎదుట విద్యార్థినీలు చీపుర్లు చేతబట్టి పాఠశాల ముందు పరి సరాలను శుభ్రపరిచారు. ఈ విషయమై మండల విద్యాధికారి వెంక టేశంను వివరణ కోరగా మండలంలో సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై తగిన చర్యలు చేపడతామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సదాశివనగర్,ఆగస్టు 29:ఎల్లారెడ్డి ఎమ్మెల్యేమదన్‌మోహన్ ప్రజాసేవలో నిరంతరం కృషిచేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి అన్నారు. మండలంలోని 42 మందికి పది లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి వెనుకబడిన ఎల్లారెడ్డిలో సంక్షేమ పథకాలతో పాటు ప్రజల అవసరాలైన ఆరోగ్యం,విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ నుండి ఆర్థిక సహాయం అందజేస్తున్నాడన్నారు. విద్యపై ప్రత్యేక శ్రద్ద వహించి శిథిలవస్థలో ఉన్న పాఠశాలల మరమ్మతులు నిర్వహిస్తున్నాడని తెలిపారు.ఈ కార్యక్రమంలోసింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి,మాజీవైస్ ఎంపీపీలు రూపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల కోఆప్షన్ ఇర్షాద్, చింతల లక్ష్మీపతి,పెసరి సాయిలు, బీరయ్యావడ్ల రాజేందర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డి, ఆగస్టు 29 : మహిళ అదృశ్యమైన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని సోమిర్యగడ్ తండాకు చెందిన దానవత్ మంజుల అనే మహిళ ఈనెల 23న రాఖీ కట్టడానికి అమ్మవారి ఇంటికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో మంజుల బావ కుటుంబ సభ్యులు ఆమె కొరకు వెతికినా ఆచూకీ లభించలేదు. మంజుల భర్త అనారోగ్యంతో మూడుసంవత్సరాల క్రితం మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కూతుర్లు ఊర్లో కూలీ పనులు చేసుకుంటూ జీవించేదని తెలిపారు. మంజుల బావ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారిణి యేమిమా
- గురుకుల పాఠశాల, పాత హరిజనవాడలో వైద్య శిబిరం

భిక్కనూరు, ఆగస్టు 29 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి యేమిమా అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలోని పాత హరిజనవాడలో, మండలంలోని సిద్ధరామేశ్వరనగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వ ర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రజలకు, విద్యార్థులకు వైద్యాధికారిణి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ మేరకు వైద్యా. దికారినీ మాట్లాడుతూ పాత హరిజనవాడలో జ్వరంతో బాధ పడుతున్న 8మంది వద్ద రక్త నమునాలను సేకరించడం జరిగిం దని, గురుకుల పాఠశాలలో నలుగురు కంటి వైద్యుడి వద్దకు, మరో ముగ్గురిని ఆర్తో, పీడియాట్రిషన్ వద్దకు రిఫర్ చేయ్యడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకటరమణ, వైద్యసి బ్బంది, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న వైద్య శిబిరం

పశువుల గేదె కంతి తొలగింపు

గాంధారి, ఆగస్టు 29: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గురువారం గాంధారి గ్రామానికి చెందిన రమేష్‌రావు అనే రైతుకు చెందిన గేదె దూడ కంతిని తొలగించారు. పశువైద్యుడు రవి కుమార్ ఆపరేషన్ చేసి దూడను సురక్షంగా కాపాడారు. గేదె కడుపులో కంతి ఉందని గ్రహించిన పశువైద్య సిబ్బంది రైతుతో మాట్లాడి గేదెను సురక్షితంగా ఉండాలంటే కంతిని తొలగించాలని వైద్యులు సూచించడంతో వెంటనే ఆపరేషన్ చేసి గేదెను కాపాడారు. దీంతో ఆ రైతు గేదెను కాపాడడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యాడారంలో డ్రగ్స్ నివారణపై విద్యార్థుల ర్యాలీ

దోమకొండ, ఆగస్టు 29: బీబీపేట మండలంలోని యాడారంలో గురువారం ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీపేట ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టే బాధ్యత యువతపైనే ఉందన్నారు. గంజా, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి మంచి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయిలో నిలవాలన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు మండల వెంకటేశం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'యువత చెడుమార్గాన్ని వీడనాడాలి'

కామారెడ్డిటౌన్,ఆగస్టు 29: యువత చెడుమార్గాన్ని వీడనాడాలని టీఎస్‌వీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు టీఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌నివారణపై చేపడుతున్న కార్యక్రమంపై వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజానికి మూలస్తంభాలుగా ఉన్నటువంటి విద్యార్థులు,యువతను చెడుమార్గం వైపు తీసుకెళ్లి వారి ఆరోగ్యాలను,దేశభవిష్యత్తును డ్రగ్స్ మహమ్మారి నాశనం చేస్తుందని దీనిపట్ల అందరూ అప్రమత్తతో ఉండాలని అవగాహన కల్పించారు. డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్క యువకుడు కదలిరావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్,ప్రిన్సిపల్ కిష్టయ్య, రాజ్‌గంబీర్‌రావు, ఎన్‌సీసీ అధికారి సుధాకర్, చంద్రశేఖర్, సాయి,రోహిత్, మహేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	కమిటి కుర్రాళ్లు
ప్రియా 70	ఆయ్
ప్రియా 35	ఆహో విక్రమార్క

బాన్సువాడ	
మహేశ్వరి	సరిపోదా శనివారం
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190